## క్లుప్తంగా

### సీఐటీయూ కార్యవర్గం ఎన్నిక


శ్రీనివాస్


రాజారావు

సింగరేణి(కొత్తగూడెం): సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శిగా విజయగిరి శ్రీనివాస్, అధ్యక్షుడిగా గాజుల రాజారావు ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం బ్రాంచి మహాసభ కొత్తగూడెంలో నిర్వహించగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు నూతన కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రాజారావు, శ్రీనివాస్, కోశాధికారిగా వై.వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా డి.వీరన్న, కె.రమేష్‌బాబు, జి.నర్సింహారావు, బి.ప్రకాశ్, ఉపాధ్యక్షులుగా సూరం అయిలయ్య, ఎల్లగొండ రామ్మూర్తి, ఎం.వెంకటేశ్వర్లు, బానోత్ అరుణ్, నాగరాజు, జ్యోతితో పాటు మరో 18 మంది సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు లిక్కి బాలరాజు, భూక్య రమేష్ పాల్గొన్నారు.

### వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగుల కోసం వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఏరియా జీఎం షాలేము రాజు ప్రారంభించారు. గురువారం 24 ఏరియా గ్రౌండ్‌లో బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ క్రీడలకు ఉచితంగా శిక్షణ అందిస్తారన్నారు. 18 ఏళ్లలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఈ పోటీల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 7 నుంచి 25 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు జరుగు శిక్షణలో పాల్గొనాలని కోరారు.

### అవార్డు గ్రహీతకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల రాష్ట్రప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు అందుకున్న మోరే రమేష్‌కుమార్‌ను సింగరేణి సెక్యూరిటీ జీఎం బి.హన్మంతరావు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా సింగరేణి సెక్యూరిటీ విభాగం పనిచేస్తున్న రమేష్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారులు, నాయకులు వేణుమాధవ్ స్వామి, రమణ, జేబీ.మోహన్, బందెల విజేందర్, ఊట్ల గణేష్, విక్టర్, సతీష్, ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

### కార్మికులకు ఉచితంగా నీరు ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆధ్వర్యాన రామవరంలో కార్మికులు, రిటైర్ కార్మికుల కోసం రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లో దందాను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏరియా ఎస్ఓటు జీఎం కోటిరెడ్డికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పహీద్ దాదా వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వాటర్ ప్లాంట్‌లో నీరు అమ్మకాలు నిలిపేసి కార్మికులకు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. నాయకులు హనీఫ్, ఖయ్యూం, హేమంత్, రణధీర్, గిరిప్రసాద్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

పాల్వంచరూరల్: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందిన ఘటన మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామపంచాయతీ నర్సంపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నెం శ్రీనివాసరావుకు చెందిన గేదె గ్రామ ప్రధాన వీధిలోని సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. గేదెపాలే తమకు జీవనాధారమని నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠలు


బోనం ఎత్తుకున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీ, రాజుతండా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, ఆంజనేయ స్వామి, ముత్యాలమ్మతల్లి, పోతురాజు విగ్రహ ప్రతిష్ఠ, మధుర బస్తీలో శ్రీశ్రీశ్రీ బంగారు పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లికృష్ణ దంపతులు పాల్గొని బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సకినాల వెంకటేశ్వర్లు, గుగులోతు రమేష్, గుగులోతు రాములు, హరి, కిషన్, బట్టు గణేష్, భూక్యా శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# శంకుస్థాపనకు ఐదేళ్లు..!

**రూ.3 కోట్లు మంజూరైనా పూర్తికాని రోడ్డు పనులు**

- అసంపూర్తిగా చల్లసముద్రం–లచ్చగూడెం రహదారి
- మొనలు తేలిన కంకరపై అవస్థలు పడుతున్న వాహనదారులు


రహదారిపై మొనలు తేలిన రాళ్లు


కంకర కొట్టుకుపోయి అధ్వానంగా మారిన రహదారి

ఇల్లెందురూరల్: వర్షాకాలంలో అడుగు తీసి అడుగు వేయలేం.. మధ్యలో రాకపోకలకు అవాంతరాలు కల్పించే వాగు.. వేసవిలో దుమ్మూధూళితో ఇబ్బందులు.. ఇలాంటి పరిస్థితిలో ఉన్న మార్గంలో రహదారి నిర్మాణానికి ఐదేళ్ల క్రితం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో తమ కష్టాలు తీరినట్లేనని ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు సంతోషించగా శంకుస్థాపన చేసి ఐదేళ్లయినా పనులు పూర్తికాకపోవడంతో వారి ఆశ నిరాశగానే మిగిలింది.

**2018లో శంకుస్థాపన..**

మండలంలోని చల్లసముద్రం నుంచి లచ్చగూడెం వరకు ఐదు కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సీఆర్ఆర్ పథకంలో భాగంగా రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు 2018 జూలై 17వ తేదీన అప్పటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేశాక ఏడాదికి కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టాడు. చల్లసముద్రం నుంచి ఆంజనేయపురం వరకు రహదారిని చదును చేసి కంకర పోయడంతో పాటు ఆంజనేయపురంలో సీసీ రోడ్డు పనులు పూర్తిచేశారు. ఇక మధ్యలో కాల్వపై వంతెన నిర్మాణానికి గోతులు తవ్వి వదిలేశారు. అలా ఏడాది పాటు పనులు నిలిచిపోవడంతో ఆంజనేయపురం వాసులు ఆందోళనకు దిగగా అధికారులు స్పందించారు. వంతెన చివరి దశలో ఉన్నప్పుడు మరోసారి పనులు ఆగగా రెండేళ్ల క్రితం మరోసారి గ్రామస్తులు నిరసన తెలిపారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణం పూర్తి చేయించినా రహదారిపై బీటీ వేసే పనులు మాత్రం సాగడం లేదు.

**నేటికీ తప్పని అవస్థలు..**

చల్లసముద్రం నుంచి లచ్చగూడెం వెళ్లే మార్గంలో ఆంజనేయపురం, ఆంజనేయపురంతండా గ్రామాలు ఉన్నాయి. ఈ రహదారి మీదుగా వెళ్లే మామిడి గుండాలకు దూరాభారం తగ్గుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం బీటీ రోడ్డును మంజూరు చేసినా పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజల ఇక్కట్లు తీరడం లేదు. రహదారి పొడవునా కంకర పోసి వదిలేయడంతో రాత్రివేళ వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఆటోడ్రైవర్లు కూడా ముందుకు రాకపోవడంతో కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, చల్లసముద్రం నుంచి లచ్చగూడెం వరకు పరిచిన కంకర భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయింది. రోలింగ్ సరిగా చేయకపోవడం వల్ల కుప్పలు, కుప్పలుగా దర్శనమిస్తోంది. ఆంజనేయపురంలో మూడేళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డుపై కంకర తేలగా, ఆంజనేయపురం శివారులో వాగుపై వంతెన, రహదారికి అనుసంధానంగా రోడ్డు కూడా అసంపూర్తిగా నిలిచిపోయింది.

**రహదారి త్వరగా పూర్తిచేయాలి**



చల్లసముద్రం నుంచి లచ్చగూడెం వరకు బీటీరోడ్డు పనులు ఐదేళ్లుగా సాగుతున్నాయి. ఎప్పుడు పూర్తిచేస్తారో కూడా తెలియడం లేదు. ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నాం. ఇకనైనా అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తిచేయించాలి.

– అంగోత్ హనుమంతు, ఆంజనేయపురం

**రాత్రిపూట ఆటోలు రావట్లేదు**



అసంపూర్తి పనుల కారణంగా రహదారి అధ్వానంగా మారింది. రాత్రివేళ ఇంటికి వచ్చేందుకు కిరాయి అదనంగా ఇస్తామన్నా ఆటోడ్రైవర్లు రావట్లేదు. గ్రామంలో సీసీ రోడ్డుపై రాళ్లు తేలాయి. బీటీ రోడ్డు కోసం పరిచిన కంకర వరదకు కొట్టుకుపోయింది.

– బానోత్ జయరాం, ఆంజనేయపురం తండా

**పనులు పూర్తి చేయిస్తాం..**



చల్లసముద్రం, లచ్చగూడెం రహదారిలో వంతెన, సీసీ రోడ్డు పనులు పూర్తిచేశాం. వంతెన వద్ద మట్టి తోలించాల్సి ఉంది. రహదారిపై కంకర కూడా పర్చాం. ఆపై బీటీ వేయాల్సి ఉంది. ఆయా పనులను సరిచేయించి త్వరగా బీటీ వేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాజు, పీఆర్ ఏఈ, ఇల్లెందు మండలం

## వీఓఏలపై చిన్నచూపు సరికాదు..


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న భాస్కర్


సింగరేణి(కొత్తగూడెం): సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు


దీక్షా శిబిరంలో వీఓఏలు..

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏల చేపడుతున్న ఆందోళన పట్ల ప్రభుత్వం చిన్నచూపు ప్రదర్శించడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మండలంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన దీక్ష శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వీఓఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో అన్ని రంగాల కార్మికులను ఉద్యమంలో దింపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ నబి, తాళ్లూరి కృష్ణ, కూకట్ల శంకర్, సుల్తానా, నవ్య, ప్రమీల, పాపారావు, మోతీలాల్, వసంతరావు, లత, రజిత, వసంత, సునీత, సురేష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్లో వీఓఏలు చేపట్టిన నిరసన దీక్షలకు సంఘీభావం తెలిపారు. కంచర్ల జమలయ్య, వీవోఏలు పాల్గొన్నారు.

టేకులపల్లి: మండలంలో వీఓఏలు చేస్తున్న సమ్మెలో మండల అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి మూడ్ చరణ్, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, శిరోమణి, మంగీలాల్ పాల్గొన్నారు.


## జేపీఎస్‌ల హామీని అమలుచేయాలి

చుంచుపల్లి: అసెంబ్లీ సాక్షిగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తానని ఇచ్చిన హామీని అమలు చేసి సీఎం కేసీఆర్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జేపీఎస్‌లు చేపట్టిన దీక్షల శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి కమ్యూనిస్టు పార్టీ, ఏఐటీయూసీ పక్షాన సంఘీభావం తెలిపారు. పంచాయతీల్లో కార్యదర్శులు లేకుండా పరిపాలన పడకేసిందని, కార్యదర్శులను క్రమబద్ధీకరించి పే–స్కేల్ నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరాటి ప్రసాద్, జమలయ్య, జేపీఎస్‌లు వంశీకృష్ణ, సురేష్, నరేష్ పాల్గొన్నారు. ఈ మేరకు మహిళా జేపీఎస్‌లు తాము విధుల్లో భాగంగా గ్రామాల పరిధిలో అందిస్తున్న సేవలను చేతులపై చిత్రీకరించుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. జిల్లాకు వచ్చిన పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీని పలువురు జేపీఎస్‌లు భద్రాచలంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు.


చుంచుపల్లి: విధుల వివరాలను చేతులపై రాసుకుని మహిళా జేపీఎస్‌లు నిరసన

**గ్రామ పంచాయతీకి తాళం**

ఇల్లెందురూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మండలంలోని పోలారం గ్రామపంచాయతీ కార్యాలయానికి పాలకవర్గం ప్రతినిధులు తాళం వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ సరోజిని, ఉపసర్పంచ్ శ్రీరాం కోటయ్య మాట్లాడారు. తాళం వేసిన విషయం తెలుసుకున్న ఎంపీఓ చిరంజీవి పాలకవర్గంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తాళం తీయాలని ఆదేశించి పంచాయతీ సిబ్బందితో తలుపులు తీయించారు.


మాట్లాడుతున్న సాబీర్ పాషా


ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీకి తాళం వేసి నిరసన తెలుపుతున్న పాలకవర్గం

### అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం, పాపకొల్లు, వీరభద్రాపురం గ్రామాల్లోని మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. స్టాక్ వివరాలను టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పుల్లమ్మ, నాగమణి, సీతామహాలక్ష్మి, భవానీ, జయ పాల్గొన్నారు.

### ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న మోయినుద్దీన్

పాల్వంచ: పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను డిప్యూటీ డెమో ఎండీ.ఫయాజ్ మోయినుద్దీన్ తనిఖీ చేశారు. గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశాల మేరకు ఆకస్మికంగా ఆస్పత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, నిర్వహణా తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో నాగలక్ష్మి, సీహెచ్‌ఓ సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ సివిల్ జీఎంకు సన్మానం


జీఎంను సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ సివిల్ జీఎంగా పదోన్నతి పొందిన టి.సూర్యనారాయణను గురువారం ఆయన చాంబర్‌లో సివిల్ ఉద్యోగులు, సివిక్ కాంట్రాక్ట్ కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా గూడెల్లి యాకయ్య, సాజిద్, షకీల్, జయంత్, మద్దెల శ్రీనివాస్, పాషా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలు తీర్చేందుకు ఎల్లవేళలా సిద్ధం


కొత్తగూడెంఅర్బన్: ప్రజలతో కలిసి రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: ప్రజల కష్టాలు తీర్చేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఇళ్లు కొంతభాగం కోల్పోయే బాధితులు ప్రగతినగర్‌లో ఆందోళన చేయడంతో విషయం తెలుసుకుని ఎమ్మెల్యే గురువారం అక్కడికి చేరుకుని వారితో మాట్లాడుతూ.. గణేష్‌టెంపుల్ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు డివైడింగ్‌లో ఇళ్లు కోల్పోతున్న బాధితుల గోడు విని 40 అడుగుల నుండి 30 అడుగులకు రోడ్డు వెడల్పు తగ్గించి రోడ్డు నిర్మాణం చేయిస్తామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బాధితులంతా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

**విగ్రహ ప్రతిష్ఠలో పూజలు**

కొత్తగూడెంటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బంగారు పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై విగ్రహప్రతిష్ఠ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు బండి నరసింహ, నేరేళ్ల సమైక్య, కో ఆప్షన్ సభ్యురాలు దుంపల అనురాధ, నాయకులు మసూద్, మాదా శ్రీరాములు, క్లాసిక్ దుర్గ, రావి రాంబాబు, యూసుఫ్, పూర్ణ, వాణి రెడ్డి, చల్లా శకుంతల, చల్లా భాస్కర్, అజయ్, ఐక్య సత్యనారాయణ, బూసి, శ్రీను, గాయత్రి, నక్క సృజన, రజాక్, బూసి, పూర్ణ, మెరుగు అనసూయ పాల్గొన్నారు.

**వరంలా దళితబంధు..**

పాల్వంచ: దళిత బంధు పథకం దళితులకు ఒక వరమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాలకోయ తండాలో దళితబంధు పథకం కింద డోలు రాము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెంట్‌హౌజ్, కిరాణా దుఖాణాలను వనమా సందర్శించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, తహసీల్దార్ రంగా ప్రసాద్, నాయకులు సాధు శంకర్, బూడిద వీరస్వామి, శంకర్, మాలోతు కోటి, ఆనంద్, భూక్యా వీరన్న, రాంబాబు, దినేశ్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: దళారుల చేతిలో రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, వైస్ చైర్మన్ బండారు శ్రీను, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ ప్రమోద్, సర్పంచ్ అలెం కౌసల్య, ఏడీఏ వాసవీరాణి, ఏవో సతీష్, పీఏసీఎస్ సీఈఓ హరిప్రసాద్, సిబ్బంది, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, వెంకన్న పాల్గొన్నారు.

టేకులపల్లి: రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మార్కెట్ యార్డు వద్ద టీఎస్ మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ బేతంపూడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. డైరెక్టర్లు భూక్య బాలాజీ, ఉల్లోజు ఉదయ్, సీఈఓ పొన్నోజు ప్రేమాచారి, కందుల వెంకటేశ్వర్లు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సీతాలక్ష్మి

కొత్తగూడెంటౌన్: వేసవి క్రీడాశిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సూచించారు. రుద్రంపూర్ పరిధిలోని త్రీ ఇంక్లైన్ పంచాయతీ పరిధి సింగరేణి రెస్క్యూ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ తరగతులను ఆమె గురువారం ప్రారంభించి మట్లాడారు. 14 ఏళ్లలోపు బాలబాలికలకు రెజ్లింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ కాపు కృష్ణ, ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్, సర్పంచ్ అంగోతు మోతి, బోడ శారద, ఆదినారాయణ, మొగిలి, జి.కృష్ణ, నీహారిక, కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### సుల్తానియాను కలిసిన సర్పంచ్‌లు

చుంచుపల్లి: జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాను పలువురు సర్పంచ్‌లు కలిశారు. భద్రాచలంలోని టూరిజం గెస్ట్ హౌస్ కలిసిన కలిసిన వారు సత్కరించాక పెండింగ్ బిల్లుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సర్పంచ్‌లు, నాయకులు తేజావత్ రతన్ నాయక్, బానోత్ రాందాస్, లకావత్ వెంకటేశ్వర్లు, బానోత్ శ్రీనివాస్, సంపత్, మాలోత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### భరోసా సభను విజయవంతం చేయండి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ భరోసా సభకు జిల్లా నుండి వేలాదిగా తరలిరావాలని బహుజన్ సమాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కోరారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 7న హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను గురువారం పార్టీ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే భోగాలు అనుభవిస్తుందన్నారు. నాయకులు సాయి, నాగుల రవికుమార్, నిరంజన్‌కుమార్, రవిశంకర్, సందేల సందీప్, హరికృష్ణ పాల్గొన్నారు.


### చట్టాలపై అవగాహన ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీం ఎస్సై రమాదేవి తెలిపారు. గురువారం బస్టాండ్ సెంటర్‌లోని ప్రియదర్శిని కళాశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రత–మాబాధ్యత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఇబ్బందులుంటే షీటీం 8712682131 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపాల్ నయీంపాషా, పీడీ కాశిమల్ల రమేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

### జలగం వెంగళరావు జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

సుజాతనగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు జయంతిని జలగం యువసేన ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరభద్రరావు, లావుడ్యా గోపి, చింతలపూడి జగన్, మండె చంటి పాల్గొన్నారు.



**అటెన్షన్ ప్లీజ్**

### మురుగుకు పరిష్కారం ఎప్పుడో..?



టేకులపల్లి పంచాయతీ స్టేట్‌బ్యాంకు వెనకాల బజారులో కొన్నేళ్లుగా మురుగు కంపు సమస్య స్థానికులను ఇబ్బంది పెడుతున్నా నేటికీ పరిష్కారం లభించడంలేదు. ఈ రోడ్డులో చివరిలో ఏ చిన్న వర్షం పడినా నీరు నిల్వ ఉంటోంది. డ్రెయినేజీలు కూడా లేకపోవడంతో నీటి పారుదల లేక నిల్వ ఉండటంతో దోమలు, క్రిమి కీటకాలు నివాసం ఉంటున్నాయి. తద్వారా మురుగు కంపు వస్తోంది. రాకపోకలు కూడా సాగించడం కష్టంగా మారిందని అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : ఎల్.కిరణ్‌కుమార్, కార్యదర్శి, టేకులపల్లి
సెల్ నంబర్ : 8008018031